సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



పన్ను చెల్లించేదెన్నడో..

ముని్సపాలిటీల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి.

- IIలో ▸



పాలకవర్గాలకు సన్మానం

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పాలన ముగియడంతో జిల్లా వ్యాప్తంగా పాలకవర్గాల సభ్యులను సన్మానించారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
32.6 /16.4

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్‌

ఓపెన్‌ డిగ్రీలో ప్రవేశానికి గడువు పెంపు

కామారెడ్డి అర్బన్‌: అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ డిగ్రీ ఫస్టియర్‌ బీఏ, బీఎస్సీ, బీకాంలో ప్రవేశానికి గడువు ఈనెల 16 వరకు పొడిగించినట్లు కామారెడ్డి అధ్యయన కేంద్రం సమన్వయకర్త రాజ్‌కుమార్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌, సమానమైన పరీక్ష పాసై వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఓపెన్‌ రీవాల్యుయేషన్‌ చేయాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ డిగ్రీ కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ఆందోళన చేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫస్ట్‌ సెమ్‌ ఎగ్జామ్స్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కేవలం 26శాతం మంది విద్యార్థులకు మాత్రమే పాస్‌ ఫలితాలు రావడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే పరీక్ష పత్రాలను ఓపెన్‌ రీవాల్యుయేషన్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్‌ కన్వీనర్‌ ఖలీల్‌, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు ప్రత్యూష రెడ్డి, కళాశాల అధ్యక్షుడు మురళి, నాయకులు సౌందర్య, రోహిత్‌, సిద్ధిశ్వర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్‌ ప్రాక్టికల్స్‌ ప్రారంభం

కామారెడ్డి టౌన్‌: ఇంటర్మీడియట్‌ ప్రాక్టికల్స్‌ గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 984 విద్యార్థులకుగాను 949 మంది హాజరుకాగా, 35 మంది గైర్హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 605 మందికిగాను 584 హాజరుకాగా, 21 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 379 మందికి గాను, 365 హాజరుకాగా, 14 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్‌ అధికారి షేక్‌సలాం తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా టీచర్లు కృషి చేయాలని జీసీడీవో ఉమాదేవి సూచించారు. గురువారం ఆమె లింగంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెచ్‌బీ టెస్టు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ప్రత్యేకాధికారి వాసంతి, సిబ్బంది ఉన్నారు.

అంతర్జాతీయ టోర్నీకి నిఖత్‌ జరీన్‌



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన బాక్సింగ్‌ క్రీడాకారిణి నిఖత్‌ జరీన్‌ అంతర్జాతీయ బాక్సింగ్‌ టోర్నీలో పాల్గొననుంది. ఈ టోర్నీ బల్గేరియాలో ఈ నెల 2 నుంచి 12 వరకు జరగనుంది. ఇందులో ఆమె 50 కేజీల విభాగంలో తలపడనున్నారు. ఆమె విజయం సాధించాలని జిల్లాకు చెందిన క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

వన్యప్రాణుల బాధితులకు పరిహారం

ఇందల్వాయి: ఇందల్వాయి ఫారెస్ట్‌ రేంజ్‌ పరిధిలో చిరుత పులి దాడుల్లో పశువులను కోల్పోయిన నలుగురికి అటవీ శాఖ తరఫున పరిహారం అందజేశారు. రేంజ్‌ కార్యాలయంలో బాధితులకు గురువారం రూ. 97,500 పరిహారాన్ని అందించినట్లు ఎఫ్‌ఆర్వో రవి మోహన్‌ భట్‌ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల దాడు ల్లో పెంపుడు పశువులు చనిపోతే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి పరిహారం పొందాలని సూచించారు. అంతేగాని వన్య ప్రాణులకు హాని కలిగించొద్దన్నారు.

మిశ్రమ స్పందన!



- మధ్య తరగతిని ఆకట్టుకునేలా కేంద్ర బడ్జెట్‌
- అద్దె ఇళ్లు, బస్తీల్లో ఉండేవారికి ఇళ్ల కోసం కొత్త పథకం
- అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలకు ఆయుష్మాన్‌ భారత్‌
- ఇళ్లకు ఉచితంగా 300 యూనిట్ల సోలార్‌ విద్యుత్‌

సాక్షి, కామారెడ్డి: కేంద్ర బడ్జెట్‌ మధ్య తరగతిని ఆకట్టుకునేలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా అద్దె ఇళ్లు, బస్తీల్లో ఉంటున్న వారికి సొంత ఇళ్లు కట్టుకునేందుకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ గురువారం పార్లమెంట్‌లో వెల్లడించారు. ఇప్పటికే అమలులో ఉన్న ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన కింద పేదలకు ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించింది. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. పాత పన్ను విధానాన్నే కొనసాగిస్తూ రూ. 7 లక్షల వరకు ఎలాంటి పన్ను ఉండబోదని ప్రకటించారు. కాగా బడ్జెట్‌లో కొత్తగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. అర్హులైన మధ్య తరగతికి ప్రజలు ఇళ్ల కొనుగోలు, సొంతింటి నిర్మాణం కోసం హౌసింగ్‌ స్కీమ్‌ తీసుకొస్తున్నట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో అద్దె ఇళ్లలో ఉండేవారి సొంతింటి కలను నిజం కాబోతుంది. పీఎం ఆవాస్‌ యోజన కింద రాబోయే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా జిల్లాలో సొంతిళ్లు లేని వారికి ప్రయోజనం కలుగనుంది. అలాగే విద్యుత్తు భారం తగ్గించే ఉద్దేశంతో ప్రభుత్వం సోలార్‌ ప్యానెళ్లతో 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ సూర్యోదయ యోజన కింద ఇళ్లపై రూఫ్‌టాప్‌ సోలార్‌ ప్యానళ్లను ఏర్పాటుచేయాలని బడ్జెట్‌లో ప్రకటించింది. దీనిద్వారా విద్యుత్‌ బిల్లుల నుంచి సామాన్య ప్రజలకు విముక్తి కలిగించేలా బడ్జెట్‌లో నూతన పథకాన్ని ఆర్థికమంత్రి ప్రకటించారు. దీన్ని అమలు చేయడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

ఆడపిల్లలకు వ్యాక్సినేషన్‌

గర్భాశయ క్యాన్సర్‌ బారిన పడకుండా తొమ్మిది నుంచి 14 ఏళ్ల లోపు బాలికలకు వ్యాక్సినేషన్‌ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనుంది. దీని ద్వారా ఆడపిల్లలు వ్యాధి బారిన పడకుండా కాపాడగలుగుతామని ప్రకటించింది.

కిలో రూ. 29కే భారత్‌ రైస్‌..

విపరీతంగా పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు కిలో బియ్యం రూ. 29కే ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. మరో వారం రోజుల్లో సన్న బియ్యాన్ని విక్రయించేందుకు కేంద్రాలు తెరుస్తామని వెల్లడించింది. వ్యవసాయానికి నానో డీఏపీ ఎరువులను అందిస్తామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

అంగన్‌వాడీలు, ఆశలకు ఆరోగ్య బీమా

మధ్యంతర బడ్జెట్‌లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లకు ఆయుష్మాన్‌ భారత్‌ను వర్తింపజేయనున్నట్లు ప్రకటించింది. ఆయుష్మాన్‌ భారత్‌ కింద ప్రస్తుతం కల్పిస్తున్న రూ. 5 లక్షల ఆరోగ్య బీమా కవరేజీ వీరికి వర్తించనుంది. ఇందులో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లకు ఆరోగ్య సేవలు అందనున్నాయి. ఆస్పత్రిలో చేరేందుకు ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ. 5 లక్షల కవరేజీని అందిస్తుంది. దీంతో ఏ రకమైన ఆరోగ్య సమస్య ఎదురైనా ఉచితంగా వైద్యం చేసుకునే వీలు కలుగనుంది.

అన్ని రంగాలకు ప్రాధాన్యత



“ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. వికసిత భారత లక్ష్యాలను ప్రతిబింబించాయి. మౌలిక వసతుల రంగానికి భారీ ప్రోత్సాహం, పేదల సొంతింటికి రుణం, అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ఉంది. విద్యం, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారతకు ఇలా అన్ని రంగాలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత దక్కింది.

– వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే కామారెడ్డి

విద్యా రంగానికి నిరాశే



“ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌ అంకెల గారడీలా ఉంది. విద్యారంగానికి కనీసం ఆరు శాతం నిధుల్ని కేటాయించాలి. విద్య, వైద్య, వ్యవసాయం రంగం లాంటి ప్రధానమైన వాటికి తక్కువ బడ్జెట్‌ కేటాయించి నిరాశ పరిచింది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రయోజకరంగా లేదు. ఆమోదించిన డబ్బును సంబంధిత పద్దులుకు విడుదల చేయాలి. కానీ అలా జరగడం లేదు. బడ్జెట్‌లో కేటాయించిన విధంగా పద్దులను పూర్తిస్థాయిలో విడుదల చేయడంలేదు.

– డాక్టర్‌ లచ్చయ్య, విద్యావేత్త, కామారెడ్డి

విద్యకు తక్కువ కేటాయింపులు



“ కామారెడ్డి అర్బన్‌: కేంద్ర బడ్జెట్‌ విద్యారంగాన్ని నిరాశపర్చింది. మొత్తం బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.61 శాతమే నిధులు కేటాయించడం శోచనీయం. ఇది విద్యాభివృద్ధికి దోహదం చేసేదిగా లేదు. నిధుల కొరతతో కొత్త విద్యాసంస్థల స్థాపన సాధ్యం కాదు. ఆదాయపు పన్ను స్లాబు పరిమితి పెంచకపోవడం వేతన జీవులకు నిరాశే.

–వేణుగోపాల్‌, పూర్వ అధ్యక్షుడు, ఏపీటీఎఫ్‌, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌

తెలంగాణకు అన్యాయం



“ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. దేశంలో ఉన్న మైనారిటీలకు బడ్జెట్లో భారీగా నిధులు కుదించారు. మైనార్టీలకు ఏటా పెంచాల్సిన బడ్జెట్లో కేవలం 0.0068% కేటాయించి అన్యాయం చేశారు. మైనార్టీల స్కాలర్‌షిప్‌ తగ్గించారు. ఈ బడ్జెట్‌ నిరాశకు గురి చేసింది.

– షబ్బీర్‌ అలీ, ప్రభుత్వ ముఖ్య సలహాదారు, కామారెడ్డి

వేతన జీవులకు మినహాయింపులు లేవు



“ కామారెడ్డి అర్బన్‌: కేంద్ర బడ్జెట్‌ వేతన జీవులను పూర్తిగా నిరాశపర్చింది. కొత్త పన్నుల విధానంలో 80సీ, 80డీ, ఇంటి అద్దె, విద్య, గృహరుణాలపై వడ్డీ తదితర మినహాయింపులు పెంచాలని మూడేళ్లుగా ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తులు చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. ప్రత్యక్ష పన్ను మినహాయింపును రూ. పది లక్షల రూపాయలకు పెంచాలి.

–ఎంఏ.బషీర్‌, జిల్లా అధ్యక్షుడు, టీఆర్‌టీఎఫ్‌

కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టేలా..



“ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌ కేవలం కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టేలా ఉంది తప్ప సామాన్యుడికి ఎలాంటి ప్రయోజనం లేదు. ఓటర్లను భ్రమల్లో పెట్టే బడ్జెట్‌గా భావిస్తున్నాం. గత బడ్జెట్‌ రూ. 45లక్షల కోట్లు కాగా ఈ సారి రూ. 47.6 లక్షల కోట్లతో మధ్యంతర బడ్జెట్‌ ప్రవేశపెట్టారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఆహార సబ్సిడీ రూ. 3లక్షల కోట్ల నుంచి రూ. 2.63 లక్షలకు, ఎరువుల సబ్సిడీని రూ. 2.55 లక్షల కోట్ల నుంచి రూ. 1.68లక్షల కోట్లకు, ఉపాధి హామీ నిధులు రూ.91వేల కోట్ల నుంచి రూ.86వేల కోట్లకు తగ్గించడం సరి కాదు. వైద్య రంగాన్ని విస్మరించారు.

– కె.చంద్రశేఖర్‌, సీపీఎం జిల్లా కార్యదర్శి, కామారెడ్డి

సోలార్‌ రూఫ్‌టాప్‌తో స్వయం సమృద్ధి



“ కామారెడ్డి అర్బన్‌: కేంద్ర ప్రభుత్వ పథకాలు సామాన్యులకు అందేలా విస్తృత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో యంత్రాంగం ఉండాలి. ముద్రా రుణాలు సామాన్యులకు అందడానికి కృషి చేయాలి. ఈబీసీలకు స్కాలర్‌షిప్‌లు అందించాలి. కోటి ఇళ్లకు సోలార్‌ రూఫ్‌టాప్‌ అనేది స్వయంసమృద్ధికి దోహదపడుతుంది. ఇంధన వ్యయ్యాన్ని ఆదా చేయడంతో పాటు కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

– పార్శి కాంశెట్టి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎఫ్‌ఎంసీజీ డీలర్స్‌ అసోసియేషన్‌

కాంగ్రెస్‌ ప్రభుత్వంలో సంతోషంగా ప్రజలు



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ

- బీఆర్‌ఎస్‌ అవినీతిని బయటపెడతాం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ

కామారెడ్డి టౌన్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చాక ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సలహాదారు షబ్బీర్‌ అలీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌ హయాంలో జరిగిన అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ అధికారి రూ. 500 కోట్లు లూటీ చేశాడంటే రాష్ట్రాన్ని ఎంత దోచుకున్నారో అర్థమవుతుందన్నారు. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరిని వదలిపెట్టబోమని వారిని జైలుకు పంపడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌ను చూసి ఓర్వలేక కేటీఆర్‌ పిచ్చోడిలా మాట్లాడుతున్నాడన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్‌ శ్రీనివాస్‌రావు, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పట్టణంలోని ఇస్లాంపూర కాలనీలో కాంగ్రెస్‌ పార్టీ, షబ్బీర్‌ అలీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండో యూఎస్‌ ఆస్పత్రికి చెందిన 30 మంది వైద్య బృందంతో నిరుపేదలకు వైద్య సేవలు అందించారు.

జహీరాబాద్‌పై బీజేపీ జెండా ఎగురవేస్తాం

- కార్యకర్తలే పార్టీకి కొండంత బలం
- టికెట్‌ ఎవరికి వచ్చినా అభ్యర్థి గెలుపునకు శాయశక్తులా పనిచేయాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి




నిజాంసాగర్‌లో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నిజాంసాగర్‌(జుక్కల్‌)/పెద్దకొడప్‌గల్‌ : రానున్న పార్లమెంట్‌ ఎన్నిక ల్లో జహీరాబాద్‌ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖా యమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. పార్టీ ఎవరికి టికెట్‌ ఇచ్చినా అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు శాయశక్తులా కృషి చేయాలన్నారు. గురువారం నిజాంసాగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద, పెద్దకొడప్‌గల్‌ మండలంలోని పోచారం చౌరస్తా సమీపంలోని గోశాలలో నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల్లో అభ్యర్థుల గెలు పు కోసం కష్టపడేది కార్యకర్తలేనని, వారు లేనిది నాయకులు ఉండరన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటేనే నాయకుడికి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ఒక్కొక్క కార్యకర్త వంద ఇళ్లను దత్తత తీసుకొని ప్రతిరోజూ ప్రధాన మోదీ అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త తనకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించాలని సూచించారు. నాయకుడి గెలుపు కోసం పాటుపడిన కార్యకర్తను నేతలు విస్మరించవద్దని ఆయన సూచించారు. భారతదేశంలో ప్రధాని ప్రవేశపెడుతున్న పథకాలు, ఆధ్యాత్మిక కా ర్యక్రమాలు, బీజేపీ సిద్ధాంతాలు పార్లమెంట్‌ ఎన్ని ల్లో అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. జహీరాబాద్‌ పార్లమెంట్‌ సీటును బీజేపీ వందశాతం గెలుస్తుందని, ప్రధాని మోదీకి అంకితం ఇస్తామని చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార, జహీరాబాద్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జి బద్దం మైపాల్‌రెడ్డి, నాయకులు పెద్ద కొడప్‌గల్‌ మండల అధ్యక్షుడు బాలాజీ పటేల్‌, రాములుసేట్‌, నరేశ్‌, గోలి స్వరూప పాల్గొన్నారు.

పల్లెల్లో ‘ప్రత్యేక’ పాలన షురూ

- బాధ్యతలు చేపట్టిన అధికారులు
- జిల్లాలో 526 పంచాయతీలు



సాక్షి, కామారెడ్డి: పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. జిల్లాలో 526 పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. గురువారం ఆయా పంచాయతీల్లో అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఐదేళ్లుగా పదవుల్లో కొనసాగిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు తమ పదవీకాలం ముగియడంతో మాజీలయ్యారు. ఇకపై ప్రత్యేకాధికారి పాలనలోనే పంచాయతీలు కొనసాగనున్నాయి. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు, ఏవోలు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, సీనియర్‌ అసిస్టెంట్లు, ఐకేపీ ఏపీఎంలు, ఏపీవోలు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, ప్రధానోపాధ్యాయులను కూడా కొన్నిచోట్ల స్పెషల్‌ ఆఫీసర్లుగా నియమించారు. జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలకు ముఖ్యమైన అధికారులను, చిన్న పంచాయతీల్లో కిందిస్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. ఎన్నికలు నిర్వహించేదాకా వారే పరిపాలన కొనసాగించనున్నారు. కాగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేకాధికారి ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుంది. పార్లమెంటు ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో అప్పటి దాకా ప్రత్యేక అధికారులే పంచాయతీల ఆలనా, పాలనా చూడాల్సి ఉంటుంది. వచ్చే వేసవి సీజన్‌లో తాగునీటి సమస్య అధికారులకు సవాల్‌గా మారనుంది. గ్రామాల్లో ఇప్పటికే భూగర్భ జలాలు పడిపోయాయి. మిషన్‌ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు సరిగా నీరు అందడం లేదు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంటుంది. అలాగే ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజల నుంచి వివిధ సంక్షేమ పథకాల కోసం తీసుకున్న దరఖాస్తుల పరిశీలన తర్వాత లబ్ధిదారుల ఎంపిక, వారికి పథకాలు అందించే బాధ్యతలన్నీ ప్రత్యేకాధికారుల చేతుల మీదుగానే జరుగనున్నాయి. దీంతో వీరిపై మరింత భారం పడనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంటుంది.


38 మంది బాలకార్మికులకు విముక్తి

- ఎస్పీ సింధు శర్మ
- ముగిసిన ఆపరేషన్‌ స్మైల్‌–10

కామారెడ్డి క్రైం: నెల రోజులుగా జిల్లాలో చేపట్టిన పదో విడత ఆపరేషన్‌ స్మైల్‌ కార్యక్రమం బుధవారంతో ముగిసినట్లు ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్‌ స్మైల్‌–10 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించామన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు బట్టల షాప్‌లు, ఆటో మొబైల్స్‌, ఇతర దుకాణాల్లో పని చేస్తున్న 38 మంది బాల కార్మికులను గుర్తించి పట్టుకున్నట్లు వెల్లడించారు. ఇందులో ఏడుగురు బాలికలు, 31 మంది బాలురు ఉన్నారని తెలిపారు. గుర్తించిన పిల్లలను జిల్లా బాలల సంరక్షణ అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. అంతేగాకుండా బాలలతో పనులు చేయిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. గుర్తించిన బాలలను చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ ముందు హాజరుపరిచి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్‌ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్‌ 100 కు గానీ, 1098 కు గానీ ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

‘సాగర్‌’ నీరు విడుదల

నిజాంసాగర్‌(జుక్కల్‌): నిజాంసాగర్‌ ప్రాజెక్టు నుంచి గురువారం నీటి విడుదలను ప్రారంభించారు. ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంటల కోసం ప్రధాన కాలువ ద్వారా 1,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా ఆయకట్టుకు నీటిని విడుదల చేయగా.. ప్రస్తుతం నాలుగో విడత వదులుతున్నారు.



సాగర్‌ నీటిని ఆయకట్టు ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులు సూచించారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 2లక్షల 43వేల 431 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

సేవ జీవితంలో భాగం కావాలి



బాన్సువాడ రూరల్ : సామాజిక సేవ విద్యార్థుల జీవితంలో భాగం కావాలనే ఉద్దేశంతో ఎన్ఎస్ఎస్ శిబిరాలు ప్రారంభించినట్లు బాన్సువాడ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి అన్నారు.

మండలంలోని కొల్లూర్, నాగారం గ్రామాల్లో గురువారం ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు తుకారం, రాచప్పలతో కలిసి ఎన్ఎస్ఎస్ యూనిట్–1 , 2 శీతాకాల శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, హెచ్ఎం కృష్ణారెడ్డి, అధ్యాపకులు రమ్యశ్రీ, గంగాధర్, శ్రీనివాస్‌రావు, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బాన్సువాడ రూరల్ : గ్రామస్తులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ప్లాస్టిక్‌ను నియంత్రించాలంటూ మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వాలింటీర్లు ఇంటింటి సర్వేద్వారా అవగాహన కల్పించారు. బడిబయట పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు రుక్మిణి, యాదాగౌడ్, అధ్యాపకులు ఇక్బాల్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: పట్టణానికి చెందిన ఆర్కిడ్స్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థులు వి.మధుప్రియ, వై.మనీశ్ రాష్ట్రస్థాయి రగ్బీకి ఎంపికై య్యారని, పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పన్ను చెల్లించేదెన్నడో?

- క్రమం తప్పుతున్న ప్రభుత్వ కార్యాలయాలు
- ఆస్తి పన్ను చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యం
- సామాన్యులను పట్టిపీడిస్తున్న అధికారులు



బాన్సువాడలో పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

బాన్సువాడ : జిల్లా కేంద్రంతోపాటు ఆయా మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి పన్ను చెల్లించని కారణంగా బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయి. ఫలితంగా చెల్లించాల్సిన అసలు పన్నుకు వడ్డీ కలిపి రెట్టింపు అవుతోంది. మున్సిపల్ అధికారులు కూడా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్ను వసూలుపై దృష్టి సారించకపోవడంతో వసూలు కావడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బకాయిలు రూ.లక్షల్లో..

ప్రతి ఏడాది పన్ను చెల్లించకపోవడంతో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోతున్నాయి. ఆయా కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల నుంచి పన్ను చెల్లించే వెసులుబాటు ఉన్నా అధికారులు చెల్లించడానికి విముఖత చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మున్సిపాలిటీకి న్యాయబద్ధంగా రావాల్సిన ఆస్తి పన్ను రాకపోవడంతో అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు ఇబ్బందికరంగా మారాయి. ఆస్తి పన్ను వసూలు కోసం ప్రతి ప్రభుత్వ కార్యాలయ అధికారికి నోటీసు ఇవ్వడంతోపాటు విషయాన్ని జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకుపోతే మొత్తం పన్ను వసూలయ్యే అవకాశం ఉంది. కానీ అధికారులు పన్ను వసూలును సీరియస్‌గా తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

బకాయిలు ఇలా..

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు	రూ.5.49 లక్షలు
మిక్స్‌డ్	రూ.25.06 లక్షలు
నాన్ రెసిడెన్సీ	రూ. 68.42 లక్షలు
రెసిడెన్సీ	రూ. 304.75 లక్షలు
రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు	రూ.98.56లక్షలు

వసూలుకు ప్రత్యేక బృందాలు

పన్ను వసూలు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 48 శాతం పన్ను వసూలైంది. మార్చిలోగా వంద శాతం పన్ను వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి నోటీసులు ఇస్తున్నాం.

– రమేశ్, కమిషనర్, బాన్సువాడ మున్సిపాలిటీ

కొనసాగుతున్న ఉపాధి ప్రజావేదిక

- మస్టర్లలో అవకతవకలు..
- మృతిచెందిన కూలీల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు గుర్తింపు



ప్రజావేదికలో సమీక్షిస్తున్న డీఆర్డీవో సాయన్న

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో 2022–23 సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో సామాజిక తనిఖీ పూర్తికాగా.. ఉపాధిహామీ కార్యాలయం వద్ద డీఆర్డీవో ఆధ్వర్యంలో గురువారం ప్రజావేదిక నిర్వహించారు. పలు గ్రామాల్లో మస్టర్లలో అవకతవకలు, మృతి చెందిన కూలీల ఖాతాల్లో డబ్బులు జమచేసినట్లు గుర్తించి ఎఫ్ఏలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్వినియోగమైన డబ్బులను రికవరీ చేయాలని ఆదేశించారు. సీతాయిపల్లి, దుర్గం, నేరల్, ముదెల్లి గ్రామాల్లో చనిపోయిన కూలీల పేరున ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు గుర్తించి డబ్బులు రికవరీకి ఆదేశించారు. గురువారం రాత్రి వరకు 31 గ్రామ పంచాయతీల సమీక్ష పూర్తయ్యింది. ప్రజావేదికలో ఎఫ్ఎం రాంనారాయణ, డీబీటీ కల్పన, డీవీవో దత్తాద్రి, ఎస్‌టీఎం నరేందర్, ఎస్ఆర్‌పీలు రవి, పాండురంగ, ఎంపీడీవో సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రకాంత్

కామారెడ్డి అర్బన్ : డిగ్రీ పూర్తయిన తర్వాత విద్యార్థులు చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని జిల్లా నోడల్ అధికారి, ఎంఎస్ఎంఈ ప్రతినిధి రాజేష్‌కుమార్ యాదవ్ అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ సౌజన్యంతో థర్డ్ ఇయర్ విద్యార్థులకు ఒకరోజు ఎంట్రప్రెన్యూర్‌షిప్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంఎస్ఎంఈలకు అనేక ప్రోత్సాహక పథకాలు అమల్లో ఉన్నాయని రాజేష్‌కుమార్ వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అడకమిక్ సమన్వయకర్త వి శంకర్ మాట్లాడుతూ ఔత్సాహిక విద్యార్థులకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పితే అద్భుతాలు జరుగుతాయన్నారు. సమావేశంలో టీఎస్‌కేసీ సమన్వయకర్త ఫర్హీన్ ఫాతియా, మెంటర్ అజారొద్దీన్, అధ్యాపకులు సుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

మొగి పురుగును నియంత్రించాలి



బీబీపేటలో వరిని పరిశీలిస్తున్న ఏడీఏ అపర్ణ



మొక్కజొన్నను పరిశీలిస్తున్న గాంధారి ఏవో నరేశ్



సజ్జన్‌పల్లిలో వరిని పరిశీలిస్తున్న ఏఈవో ప్రశాంత్

బీబీపేట/మాచారెడ్డి/లింగంపేట: వరి పంటను ప్రస్తుతం కాండం తొలుచు, మొగి పురుగు ఆశిస్తున్నదని, వాటి ని యంత్రణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఏడీఏ అపర్ణ, లింగంపేట ఏఈవో ప్రశాంత్‌కుమార్ సూ చించారు. బీబీపేట మండల కేంద్రంతోపాటు మాచారెడ్డి మండలం ఎల్లంపేట, నడిమి తండా గ్రామాల్లో ఏడీఏ, లింగంపేట మండలం సజ్జన్‌పల్లిలో ఏఈవో గురువారం వారు పర్యటించి వరిని పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వరిలో మొగి పురుగు నివారణకు వరి నాటిన 20 రోజుల్లోగా కారటప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున ఇసుకతో కలిపి వేయాలన్నారు. 20 రోజుల దాటిన వరికి కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ మందును ఎకరానికి 400 గ్రాములు లేదా క్లోరాంతనిలిప్రోల్ 60 ఎంఎల్ లేదా టెట్రానిలిప్రోలు 100 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. పొలాల గట్ల మీద కలుపు, అధిక యూరియా వాడకం కారణంగా అగ్గి తెగులు కూడా కొన్ని చోట్ల పంటను ఆశించిందని, దాని నివారణకు ట్రియసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చే యాలని సూచించారు. ఏడీఏ వెంట ఏవో పవన్, ఏఈవో రాఘవేంద్ర, ఏఈవో వెంట రైతులు పోచయ్య, సాయిలు, బాల పోచయ్య తదితరులున్నారు.

గాంధారి మండలంలో..

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని గౌరారం, ముదెల్లి గ్రామాల్లో ఏవో నరేశ్ పర్యటించి వరి, మొక్కజొన్నను పరిశీలించారు. వరిని కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు, జొన్న, మొక్కజొన్నను కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు ఆశించిందని ఆయన తెలిపారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించామన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంగీత

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గురుకుల పాఠశాల విద్యార్థిని నేహ జాతీయస్థాయి అండర్–14 స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత గురువారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో నేహ పాల్గొంటుందన్నారు. అనంతరం విద్యార్థిని నేహను ప్రిన్సిపాల్ సంగీత, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పీఈటీ జ్యోత్స్న, హౌస్ టీచర్ చెన్నకేశ్వరి తదితరులు అభినందించారు.

గ్రీన్‌హౌస్ సేద్యంతో ఎన్నో లాభాలు



మాచారెడ్డి : గ్రీన్‌హౌస్ సేద్యంతో ఎన్నో లాభాలుంటాయని కామారెడ్డి ఏడీఏ అపర్ణ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఖేతి సంస్థ ఆధ్వర్యంలో గ్రీన్ హౌస్ సేద్యంపై 60మంది రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీన్‌హౌజ్ సేద్యం వల్ల చీడ పీడల భారీ నుంచి పంటలను రక్షించుకోవచ్చన్నారు. అలాగే మామూలు సేద్యం కంటే అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఖేతి సంస్థ రీజినల్ మేనేజర్ విఠల్ మాట్లాడుతూ రూ.1.16లక్షల ఖేతీ హౌస్‌ను 52శాతం సబ్సిడీపై రూ. 50 వేలకే అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాచారెడ్డి, భిక్కనూరు ఏవోలు రమ్యశ్రీ, రాధ, ఏఈవోలు శ్రీకాంత్, యూసఫ్, రాంలు, లక్ష్మణ్ ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

బాన్సువాడ రూరల్ : గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా గ్రామస్తులు సహకరించాలని బోర్లం గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారిగా నియమించబడిన ఎంఈవో నాగేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని 25 జీపీలకు మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులకు ప్రత్యేకాధికారులను నియమించారన్నారు. జీపీ కార్యదర్శి సాయికుమార్, సర్పంచ్ సరళ, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, దేవేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, గోపన్‌పల్లి సాయిలు, మన్నె విఠల్, దడ్గి ఆహ్మద్, మంజూర్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు



బస్వాపూర్ వద్ద మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

భిక్కనూరు : కామారెడ్డి నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, మురికికాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 13 కోట్లను మంజూరు చేసిందని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండలం బస్వాపూర్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారందరికి గుర్తింపు ఉంటుందన్నారు. అర్హులకు సంక్షేమ ఫలాలు ఉంటాయన్నారు. ఆరుగ్యారంటీ పథకాలతో పాటు వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు డు కైలాస్ శ్రీనివాస్‌రావు, ఎంపీపీ గాలిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, నేతలు సాజిద్, దయాకర్‌రెడ్డి, చింటు, కిరణ్, సురేశ్, శ్రీనివాస్, లింబాద్రి, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న షబ్బీర్ అలీ, టీపీటీఎఫ్ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్ : ఈనెల 11, 12వ తేదీల్లో ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్ పోస్టర్లను ప్రభుత్వ ముఖ్య సలహాదారు షబ్బీర్ అలీ చేతుల మీదుగా గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. అనిల్ కుమార్, మాజీ రాష్ట్ర అధ్యక్షులు కే రమణ, ఉపాధ్యక్షురాలు నలినీ దేవి, నాయకులు విజయశ్రీ, స్వప్న, ప్రియ తదితరులున్నారు.

సిబ్బంది కష్టపడి పని చేయాలి

బాన్సువాడ రూరల్ : వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడానికి ట్రాన్స్‌కో సిబ్బంది కష్టపడి పనిచేయాలని కామారెడ్డి ఎస్ఈ రమేశ్ బాబు అన్నారు. గురువారం మండలంలోని సోమేశ్వర్ శివారులోని రైతువేదికలో బాన్సువాడ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ భారం తగ్గించాలన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. డీఈ కామేశ్వరరావు, ఎస్ఏవో శ్రీనివాస్, వెంకటరంగయ్య, డివిజన్‌లోని ఆయా మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షలకు టోకరా..

కామారెడ్డి క్రైం: సైబర్ మోసాలపై పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా.. ఏదో ఓచోట మోసం జరుగుతూనే ఉంది. మోసగాళ్లు కొత్తదారులను వెతుకుతూ డబ్బులు కాజేస్తున్నారు. ఈ కోవలోనే మరో ఘటన పట్టణంలో గురువారం వెలుగు చూసింది. భానుప్రకాశ్ అనే వ్యక్తికి రెండురోజుల క్రితం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ ఐసీఐసీఐ క్రెడిట్ కార్డుకు అంతర్జాతీయ లావాదేవి ఆప్షన్ ఆన్‌లో ఉందని, ఆఫ్ చేయాలంటే తాను చెప్పిన విధంగా చేయాలన్నాడు. అతను చెప్పినట్లు ప్లేస్టోర్‌లో 'ఐ' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని క్రెడిట్ కార్డు వివరాలు ఇవ్వగానే అతని అకౌంట్‌లో నుంచి రూ.1.50 లక్షలు కట్ అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన భానుప్రకాశ్ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వృద్ధురాలి మృతి



నవీపేట: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కిందపడి స్టేషన్ ఏరియాకు చెందిన రత్నావత్ శృతి అలియాస్ గుండిబాయి(60) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ గురువారం తెలిపారు. కాచిగూడ నుంచి నాగర్‌సోల్‌కు వెళ్తున్న రైలులో తినుబండారాల ప్యాకెట్లు విక్రయించే వృద్ధురాలు ఒక బోగీ నుంచి మరో బోగీలో ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి రైలు కిందపడి మృతి చెందిందన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



బీబీపేట: బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని యాడారంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సంఘమేశ్వర్(46) మూడు రోజుల క్రితం బీబీపేటకు వచ్చి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గురువారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కంజర్ గ్రామానికి చెందిన పిల్లి భూమారావు మోపాల్ నుంచి వస్తుండగా, కులాస్‌పూర్‌కు చెందిన పసుల శేఖర్ తన భార్య, చిన్నమ్మతో మోపాల్ వైపు వస్తుండగా కంజర్ శివారులో బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శేఖర్, ఆయన భార్య, చిన్నమ్మకు గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై గంగాధర్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రుద్రూర్: కోటగిరి మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక అశోక్ లేలాండ్ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీలో పట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం వాహనాలను సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు.

బస్సులో బంగారం చోరీ



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎడపల్లి/బోధన్ టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గుండ్లు చోరీకి గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన పోసాని రుద్రూర్‌లో బంధువుల శుభకార్యం నిమిత్తం గురువారం వెళ్లింది. తిరుగు ప్రయాణంలో బోధన్ బస్టాండ్‌లో నిజామాబాద్‌కు వచ్చే బస్సు ఎక్కింది. బస్సు ఎక్కినప్పుడు మెడలో ఉన్న రెండు తులాల బంగారు గుండ్లు ఎడపల్లి ప్రాంతంలో చూసే సరికి కనిపించలేదు. దీంతో బాధితురాలు డ్రైవర్, కండక్టర్‌కు చెప్పడంతో వారు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ప్రయాణికులను తనిఖీ చేయగా బంగారం లభించలేదు. దీంతో బాధితురాలిని బోధన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

మహిళల సొమ్ము హాంఫట్..

- రూ. 6 లక్షల సొమ్ము కాజేసిన కెనరా బ్యాంక్ కరస్పాండెంట్

వర్ని: డ్వాక్రా సంఘం మహిళలు ప్రతి నెలా జమ చేస్తున్న రూ. 6లక్షల60వేల నగదును ఓ ప్రబుద్ధుడు తనదైన శైలిలో హాంఫట్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సైదిమల్ గ్రామానికి చెందిన జైభవాని గ్రూపు సభ్యులు 25 నెలలుగా గ్రామంలో ఏర్పాటు చేసిన కెనరా సర్వీస్ బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తున్నారు. ఈ సర్వీసు బ్యాంక్‌ను అదే గ్రామానికి చెందిన కృష్ణ నిర్వహిస్తుండగా అతనికి గత 25 నెలలుగా సంఘ సభ్యులు నగదును అందజేస్తున్నారు. వారికి నామమాత్రపు రసీదులు ఇచ్చి నగదు బ్యాంకులో జమ అయిందని చెప్పేవాడు.

ఈ విషయమై బ్యాంకులో సభ్యులు విచారణ చేయగా ఖాతాలో జీరో బ్యాలెన్స్ ఉండడంతో కృష్ణను ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రూప్ రెండో లీడర్ వద్ల బాలమణి, సభ్యులు తెలిపారు.

కొరట్‌పల్లి తండాలో ఇద్దరి అరెస్ట్



ఆర్మూర్‌టౌన్: డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి తండాలో సారా కాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ గురువారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా సారా, బెల్లం పానకం లభ్యమైనట్లు చెప్పారు. నిషేధిత సారా కాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయన వెంట ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బేకరీలో కుళ్లిన కేక్‌లు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని డాల్ఫిన్ బెంగళూరు బేకరీలో కుళ్లిన కేక్‌లు విక్రయిస్తుండడంతో పలువురు ఆందోళనకు దిగారు. గురువారం పుట్టినరోజు వేడుకల కోసం ఓ కస్టమర్ బేకరీ నుంచి కేక్ తీసుకెళ్లాడు. అది తిన్న బాధితులకు వాంతులయ్యాయి. ఈ విషయమై బేకరీ నిర్వాహకుడిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు బాధితులు తెలిపారు. ఆర్మూర్ ఇన్‌చార్జి కమిషనర్ భూమేశ్వర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌కు ఫిర్యాదు చేయడంతో వారు కుళ్లిన కేకులను పరిశీలించారు. తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇంటి యజమానులు అనుమతి తీసుకోవాలి

ఖలీల్ వాడి: గల్ఫ్, పాస్‌పోర్ట్, ట్రావెల్స్ ఏజెంట్లకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ఇంటి యజమానులు అనుమతి తీసుకోవాలని నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో సూచించారు. ఏజెంట్లకు సంబంధించిన వివరాలను ఇంటి యజమానులు తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

రాజంపేట: డ్రంకన్ డ్రైవ్‌లో మండల కేంద్రానికి చెందిన మ్యాదరి లక్ష్మణ్‌కు రెండో తరగతి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై సంపత్ గురువారం తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు.

అనుమానితుల పట్టివేత

తాడ్వాయి: మండలంలోని కన్కల్ గ్రామంలో భిక్షాటన పేరిట తిరుగుతున్న నలుగురు అనుమానిత మహిళలను గ్రామస్తులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు గురువారం తరలించారు. ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన వీరు గ్రామంలో బియ్యం, నగదు పేరిట భిక్షాటన చేస్తున్నారు. వీరి ప్రవర్తపై అనుమానం వచ్చిన గ్రామస్తులు వారిని నిలదీశారు. మీరు భిక్షాటన కోసం రాలేదని చిన్నపిల్లలను దొంగిలించేందుకు వచ్చారంటు వారిని పట్టుకొని పీఎస్‌కు తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: పట్టణంలోని పెద్ద బజార్‌లో ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఫర్హానా బేగం బుధవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పిల్లలతో కలిసి పక్క కాలనీలో ఉండే తల్లిగారి ఇంటికి వెళ్లింది. గురువారం సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. 2 తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



పన్ను చెల్లించేదెన్నడో..

మున్సిపాలిటీల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి.

- IIలో ▸



పాలకవర్గాలకు సన్మానం

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పాలన ముగియడంతో జిల్లా వ్యాప్తంగా పాలకవర్గాల సభ్యులను సన్మానించారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
32.6 /16.4

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి గడువు పెంపు

కామారెడ్డి అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ఫస్టియర్ బీఏ, బీఎస్సీ, బీకాంలో ప్రవేశానికి గడువు ఈనెల 16 వరకు పొడిగించినట్లు కామారెడ్డి అధ్యయన కేంద్రం సమన్వయకర్త రాజ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, సమానమైన పరీక్ష పాసై వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఓపెన్ రీవాల్యుయేషన్ చేయాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ఆందోళన చేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫస్ట్ సెమ్ ఎగ్జామ్స్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కేవలం 26శాతం మంది విద్యార్థులకు మాత్రమే పాస్ ఫలితాలు రావడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే పరీక్ష పత్రాలను ఓపెన్ రీవాల్యుయేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు ప్రత్యూష రెడ్డి, కళాశాల అధ్యక్షుడు మురళి, నాయకులు సౌందర్య, రోహిత్, సిద్దిశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 984 విద్యార్థులకుగాను 949 మంది హాజరు కాగా, 35 మంది గైర్హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 605 మందికి గాను 584 హాజరుకాగా, 21 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 379 మందికి గాను, 365 హాజరుకాగా, 14 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి షేక్‌సలాం తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా టీచర్లు కృషి చేయాలని జీసీడీవో ఉమాదేవి సూచించారు. గురువారం ఆమె లింగంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెచ్‌బీ టెస్టు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ప్రత్యేకాధికారి వాసంతి, సిబ్బంది ఉన్నారు.

అంతర్జాతీయ టోర్నీకి నిఖత్ జరీన్



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో పాల్గొననుంది. ఈ టోర్నీ బల్గేరియాలో ఈ నెల 2 నుంచి 12 వరకు జరగనుంది. ఇందులో ఆమె 50 కేజీల విభాగంలో తలపడనున్నారు. ఆమె విజయం సాధించాలని జిల్లాకు చెందిన క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

వన్యప్రాణుల బాధితులకు పరిహారం

ఇందల్వాయి: ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చిరుత పులి దాడుల్లో పశువులను కోల్పోయిన నలుగురికి అటవీ శాఖ తరఫున పరిహారం అందజేశారు. రేంజ్ కార్యాలయంలో బాధితులకు గురువారం రూ. 97,500 పరిహారాన్ని అందించినట్లు ఎఫ్ఆర్వో రవి మోహన్ భట్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల దాడు ల్లో పెంపుడు పశువులు చనిపోతే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి పరిహారం పొందాలని సూచించారు. అంతేగాని వన్య ప్రాణులకు హాని కలిగించొద్దన్నారు.

మిశ్రమ స్పందన!

- మధ్య తరగతిని ఆకట్టుకునేలా కేంద్ర బడ్జెట్
- అద్దె ఇళ్లు, బస్తీల్లో ఉండేవారికి ఇళ్ల కోసం కొత్త పథకం
- అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలకు ఆయుష్మాన్ భారత్
- ఇళ్లకు ఉచితంగా 300 యూనిట్ల సోలార్ విద్యుత్



సాక్షి, కామారెడ్డి: కేంద్ర బడ్జెట్ మధ్య తరగతిని ఆకట్టుకునేలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా అద్దె ఇళ్లు, బస్తీల్లో ఉంటున్న వారికి సొంత ఇళ్లు కట్టుకునేందుకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో వెల్లడించారు. ఇప్పటికే అమలులో ఉన్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పేదలకు ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించింది. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. పాత పన్ను విధానాన్నే కొనసాగిస్తూ రూ. 7 లక్షల వరకు ఎలాంటి పన్ను ఉండబోదని ప్రకటించారు. కాగా బడ్జెట్‌లో కొత్తగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. అర్హులైన మధ్య తరగతికి ప్రజలు ఇళ్ల కొనుగోలు, సొంతింటి నిర్మాణం కోసం హౌసింగ్ స్కీమ్ తీసుకొస్తున్నట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో అద్దె ఇళ్లలో ఉండేవారి సొంతింటి కలను నిజం కాబోతుంది. పీఎం ఆవాస్ యోజన కింద రాబోయే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా జిల్లాలో సొంతిళ్లు లేని వారికి ప్రయోజనం కలుగనుంది. అలాగే విద్యుత్తు భారం తగ్గించే ఉద్దేశంతో ప్రభుత్వం సోలార్ ప్యానెళ్లతో 300 యూనిట్ల ఉచిత విద్యుత్ సూర్యోదయ యోజన కింద ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్లను ఏర్పాటుచేయాలని బడ్జెట్‌లో ప్రకటించింది. దీనిద్వారా విద్యుత్ బిల్లుల నుంచి సామాన్య ప్రజలకు విముక్తి కలిగించేలా బడ్జెట్‌లో నూతన పథకాన్ని ఆర్థికమంత్రి ప్రకటించారు. దీన్ని అమలు చేయడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

ఆడపిల్లలకు వ్యాక్సినేషన్

గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా తొమ్మిది నుంచి 14 ఏళ్ల లోపు బాలికలకు వ్యాక్సినేషన్ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనుంది. దీని ద్వారా ఆడపిల్లలు వ్యాధి బారిన పడకుండా కాపాడగలుగుతామని ప్రకటించింది.

కిలో రూ. 29కే భారత్ రైస్..

విపరీతంగా పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు కిలో బియ్యం రూ. 29కే ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. మరో వారం రోజుల్లో సన్న బియ్యాన్ని విక్రయించేందుకు కేంద్రాలు తెరుస్తామని వెల్లడించింది. వ్యవసాయానికి నానో డీఏపీ ఎరువులను అందిస్తామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

అంగన్‌వాడీలు, ఆశలకు ఆరోగ్య బీమా

మధ్యంతర బడ్జెట్‌లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లకు ఆయుష్మాన్ భారత్‌ను వర్తింపజేయనున్నట్లు ప్రకటించింది. ఆయుష్మాన్ భారత్ కింద ప్రస్తుతం కల్పిస్తున్న రూ. 5 లక్షల ఆరోగ్య బీమా కవరేజీ వీరికి వర్తించనుంది. ఇందులో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లకు ఆరోగ్య సేవలు అందనున్నాయి. ఆస్పత్రిలో చేరేందుకు ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ. 5 లక్షల కవరేజీని అందిస్తుంది. దీంతో ఏ రకమైన ఆరోగ్య సమస్య ఎదురైనా ఉచితంగా వైద్యం చేసుకునే వీలు కలుగనుంది.

అన్ని రంగాలకు ప్రాధాన్యత



“ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. వికసిత భారత లక్ష్యాలను ప్రతిబింబించాయి. మౌలిక వసతుల రంగానికి భారీ ప్రోత్సాహం, పేదల సొంతింటికి రుణం, అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ఉంది. విద్యం, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారతకు ఇలా అన్ని రంగాలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత దక్కింది.

– వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే కామారెడ్డి

విద్యా రంగానికి నిరాశే



“ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. విద్యారంగానికి కనీసం ఆరు శాతం నిధుల్ని కేటాయించాలి. విద్య, వైద్య, వ్యవసాయం రంగం లాంటి ప్రధానమైన వాటికి తక్కువ బడ్జెట్ కేటాయించి నిరాశ పరిచింది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రయోజకరంగా లేదు. ఆమోదించిన డబ్బును సంబంధిత పద్దులకు విడుదల చేయాలి. కానీ అలా జరగడం లేదు. బడ్జెట్‌లో కేటాయించిన విధంగా పద్దులను పూర్తిస్థాయిలో విడుదల చేయడంలేదు.

– డాక్టర్ లచ్చయ్య, విద్యావేత్త, కామారెడ్డి

విద్యకు తక్కువ కేటాయింపులు



కామారెడ్డి అర్బన్: “ కేంద్ర బడ్జెట్ విద్యారంగాన్ని నిరాశపర్చింది. మొత్తం బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.61 శాతమే నిధులు కేటాయించడం శోచనీయం. ఇది విద్యాభివృద్ధికి దోహదం చేసేదిగా లేదు. నిధుల కొరతతో కొత్త విద్యాసంస్థల స్థాపన సాధ్యం కాదు. ఆదాయపు పన్ను స్లాబు పరిమితి పెంచకపోవడం వేతన జీవులకు నిరాశే.

–వేణుగోపాల్, పూర్వ అధ్యక్షుడు, ఏపీటీఎఫ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్

తెలంగాణకు అన్యాయం



“ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. దేశంలో ఉన్న మైనారిటీలకు బడ్జెట్లో భారీగా నిధులు కుదించారు. మైనార్టీలకు ఏటా పెంచాల్సిన బడ్జెట్లో కేవలం 0.0068% కేటాయించి అన్యాయం చేశారు. మైనార్టీల స్కాలర్‌షిప్ తగ్గించారు. ఈ బడ్జెట్ నిరాశకు గురి చేసింది.

– షబ్బీర్ అలీ, ప్రభుత్వ ముఖ్య సలహాదారు, కామారెడ్డి

వేతన జీవులకు మినహాయింపులు లేవు



కామారెడ్డి అర్బన్: “ కేంద్ర బడ్జెట్ వేతన జీవులను పూర్తిగా నిరాశపర్చింది. కొత్త పన్నుల విధానంలో 80సీ, 80డీ, ఇంటి అద్దె, విద్య, గృహరుణాలపై వడ్డీ తదితర మినహాయింపులు పెంచాలని మూడేళ్లుగా ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తులు చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. ప్రత్యక్ష పన్ను మినహాయింపును రూ. పది లక్షల రూపాయలకు పెంచాలి.

–ఎంఏ.బషీర్, జిల్లా అధ్యక్షుడు, టీఆర్‌టీఎఫ్

కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టేలా..



“ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కేవలం కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టేలా ఉంది తప్ప సామాన్యుడికి ఎలాంటి ప్రయోజనం లేదు. ఓటర్లను భ్రమల్లో పెట్టే బడ్జెట్‌గా భావిస్తున్నాం. గత బడ్జెట్ రూ. 45లక్షల కోట్లు కాగా ఈ సారి రూ. 47.6 లక్షల కోట్లతో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఆహార సబ్సిడీ రూ. 3లక్షల కోట్ల నుంచి రూ. 2.63 లక్షలకు, ఎరువుల సబ్సిడీని రూ. 2.55 లక్షల కోట్ల నుంచి రూ. 1.68లక్షల కోట్లకు, ఉపాధి హామీ నిధులు రూ.91వేల కోట్ల నుంచి రూ.86వేల కోట్లకు తగ్గించడం సరి కాదు. వైద్య రంగాన్ని విస్మరించారు.

– కె.చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి, కామారెడ్డి

సోలార్ రూఫ్‌టాప్‌తో స్వయం సమృద్ధి



కామారెడ్డి అర్బన్: “ కేంద్ర ప్రభుత్వ పథకాలు సామాన్యులకు అందేలా విస్తృత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో యంత్రాంగం ఉండాలి. ముద్రా రుణాలు సామాన్యులకు అందడానికి కృషి చేయాలి. ఈబీసీలకు స్కాలర్‌షిప్‌లు అందించాలి. కోటి ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ అనేది స్వయంసమృద్ధికి దోహదపడుతుంది. ఇంధన వ్యయాన్ని ఆదా చేయడంతో పాటు కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

– పార్శి కాంశెట్టి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎఫ్ఎంసీజీ డీలర్స్ అసోసియేషన్

కాంగ్రెస్ ప్రభుత్వంలో సంతోషంగా ప్రజలు



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

- బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతాం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ అధికారి రూ. 500 కోట్లు లూటీ చేశాడంటే రాష్ట్రాన్ని ఎంత దోచుకున్నారో అర్థమవుతుందన్నారు. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరిని వదలిపెట్టబోమని వారిని జైలుకు పంపడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌ను చూసి ఓర్వలేక కేటీఆర్ పిచ్చోడిలా మాట్లాడుతున్నాడన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పట్టణంలోని ఇస్లాంపూర కాలనీలో కాంగ్రెస్ పార్టీ, షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండో యూఎస్ ఆస్పత్రికి చెందిన 30 మంది వైద్య బృందంతో నిరుపేదలకు వైద్య సేవలు అందించారు.

జహీరాబాద్‌పై బీజేపీ జెండా ఎగురవేస్తాం

- కార్యకర్తలే పార్టీకి కొండంత బలం
- టికెట్ ఎవరికి వచ్చినా అభ్యర్థి గెలుపునకు శాయశక్తులా పనిచేయాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి




నిజాంసాగర్‌లో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నిజాంసాగర్(జుక్కల్)/పెద్దకొడప్‌గల్ : రానున్న పార్లమెంట్ ఎన్నిక ల్లో జహీరాబాద్ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖా యమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు శాయశక్తులా కృషి చేయాలన్నారు. గురువారం నిజాంసాగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద, పెద్దకొడప్‌గల్ మండలంలోని పోచారం చౌరస్తా సమీపంలోని గోశాలలో నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల్లో అభ్యర్థుల గెలు పు కోసం కష్టపడేది కార్యకర్తలేనని, వారు లేనిది నాయకులు ఉండరన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటేనే నాయకుడికి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ఒక్కొక్క కార్యకర్త వంద ఇళ్లను దత్తత తీసుకొని ప్రతిరోజూ ప్రధాన మోదీ అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త తనకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించాలని సూచించారు. నాయకుడి గెలుపు కోసం పాటుపడిన కార్యకర్తను నేతలు విస్మరించవద్దని ఆయన సూచించారు. భారతదేశంలో ప్రధాని ప్రవేశపెడుతున్న పథకాలు, ఆధ్యాత్మిక కా ర్యక్రమాలు, బీజేపీ సిద్ధాంతాలు పార్లమెంట్ ఎన్ని ల్లో అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సీటును బీజేపీ వందశాతం గెలుస్తుందని, ప్రధాని మోదీకి అంకితం ఇస్తామని చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి బద్దం మైపాల్‌రెడ్డి, నాయకులు పెద్ద కొడప్‌గల్ మండల అధ్యక్షుడు బాలాజీ పటేల్, రాములుసేట్, నరేశ్, గోలి స్వరూప పాల్గొన్నారు.

పల్లెల్లో ‘ప్రత్యేక’ పాలన షురూ

- బాధ్యతలు చేపట్టిన అధికారులు
- జిల్లాలో 526 పంచాయతీలు



సాక్షి, కామారెడ్డి: పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. జిల్లాలో 526 పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. గురువారం ఆయా పంచాయతీల్లో అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఐదేళ్లుగా పదవుల్లో కొనసాగిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు తమ పదవీకాలం ముగియడంతో మాజీలయ్యారు. ఇకపై ప్రత్యేకాధికారి పాలనలోనే పంచాయతీలు కొనసాగనున్నాయి. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు, ఏవోలు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, ఐకేపీ ఏపీఎంలు, ఏపీవోలు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, ప్రధానోపాధ్యాయులను కూడా కొన్నిచోట్ల స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలకు ముఖ్యమైన అధికారులను, చిన్న పంచాయతీల్లో కిందిస్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. ఎన్నికలు నిర్వహించేదాకా వారే పరిపాలన కొనసాగించనున్నారు. కాగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేకాధికారి ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుంది. పార్లమెంటు ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో అప్పటి దాకా ప్రత్యేక అధికారులే పంచాయతీల ఆలనా, పాలనా చూడాల్సి ఉంటుంది. వచ్చే వేసవి సీజన్‌లో తాగునీటి సమస్య అధికారులకు సవాల్‌గా మారనుంది. గ్రామాల్లో ఇప్పటికే భూగర్భ జలాలు పడిపోయాయి. మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు సరిగా నీరు అందడం లేదు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంటుంది. అలాగే ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజల నుంచి వివిధ సంక్షేమ పథకాల కోసం తీసుకున్న దరఖాస్తుల పరిశీలన తర్వాత లబ్ధిదారుల ఎంపిక, వారికి పథకాలు అందించే బాధ్యతలన్నీ ప్రత్యేకాధికారుల చేతుల మీదుగానే జరుగనున్నాయి. దీంతో వీరిపై మరింత భారం పడనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంటుంది.


38 మంది బాలకార్మికులకు విముక్తి

- ఎస్పీ సింధు శర్మ
- ముగిసిన ఆపరేషన్ స్మైల్–10

కామారెడ్డి క్రైం: నెల రోజులుగా జిల్లాలో చేపట్టిన పదో విడత ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం బుధవారంతో ముగిసినట్లు ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్–10 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించామన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు బట్టల షాప్‌లు, ఆటో మొబైల్స్, ఇతర దుకాణాల్లో పని చేస్తున్న 38 మంది బాల కార్మికులను గుర్తించి పట్టుకున్నట్లు వెల్లడించారు. ఇందులో ఏడుగురు బాలికలు, 31 మంది బాలురు ఉన్నారని తెలిపారు. గుర్తించిన పిల్లలను జిల్లా బాలల సంరక్షణ అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. అంతేగాకుండా బాలలతో పనులు చేయిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. గుర్తించిన బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్ 100 కు గానీ, 1098 కు గానీ ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

‘సాగర్’ నీరు విడుదల

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి గురువారం నీటి విడుదలను ప్రారంభించారు. ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంటల కోసం ప్రధాన కాలువ ద్వారా 1,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా ఆయకట్టుకు నీటిని విడుదల చేయగా.. ప్రస్తుతం నాలుగో విడత వదులుతున్నారు.



సాగర్ నీటిని ఆయకట్టు ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులు సూచించారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 2లక్షల 43వేల 431 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

సేవ జీవితంలో భాగం కావాలి



బాన్సువాడ రూరల్ : సామాజిక సేవ విద్యార్థుల జీవితంలో భాగం కావాలనే ఉద్దేశంతో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు ప్రారంభించినట్లు బాన్సువాడ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి అన్నారు.

మండలంలోని కొల్లూర్, నాగారం గ్రామాల్లో గురువారం ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు తుకారం, రాచప్పలతో కలిసి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 , 2 శీతాకాల శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, అధ్యాపకులు రమ్యశ్రీ, గంగాధర్, శ్రీనివాస్‌రావు, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బాన్సువాడ రూరల్ : గ్రామస్తులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ప్లాస్టిక్‌ను నియంత్రించాలంటూ మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వాలింటీర్లు ఇంటింటి సర్వేద్వారా అవగాహన కల్పించారు. బడిబయట పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు రుక్మిణి, యాదాగౌడ్, అధ్యాపకులు ఇక్బాల్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: పట్టణానికి చెందిన ఆర్కిడ్స్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థులు వి.మధుప్రియ, వై.మనీశ్ రాష్ట్రస్థాయి రగ్బీకి ఎంపికై య్యారని, పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పన్ను చెల్లించేదెన్నడో?

- క్రమం తప్పుతున్న ప్రభుత్వ కార్యాలయాలు
- ఆస్తి పన్ను చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యం
- సామాన్యులను పట్టిపీడిస్తున్న అధికారులు



బాన్సువాడలో పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

బాన్సువాడ : జిల్లా కేంద్రంతోపాటు ఆయా మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి పన్ను చెల్లించని కారణంగా బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయి. ఫలితంగా చెల్లించాల్సిన అసలు పన్నుకు వడ్డీ కలిపి రెట్టింపు అవుతోంది. మున్సిపల్ అధికారులు కూడా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్ను వసూలుపై దృష్టి సారించకపోవడంతో వసూలు కావడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బకాయిలు రూ.లక్షల్లో..

ప్రతి ఏడాది పన్ను చెల్లించకపోవడంతో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోతున్నాయి. ఆయా కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల నుంచి పన్ను చెల్లించే వెసులుబాటు ఉన్నా అధికారులు చెల్లించడానికి విముఖత చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మున్సిపాలిటీకి న్యాయబద్ధంగా రావాల్సిన ఆస్తి పన్ను రాకపోవడంతో అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు ఇబ్బందికరంగా మారాయి. ఆస్తి పన్ను వసూలు కోసం ప్రతి ప్రభుత్వ కార్యాలయ అధికారికి నోటీసు ఇవ్వడంతోపాటు విషయాన్ని జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకుపోతే మొత్తం పన్ను వసూలయ్యే అవకాశం ఉంది. కానీ అధికారులు పన్ను వసూలును సీరియస్‌గా తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

బకాయిలు ఇలా..

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు	రూ.5.49 లక్షలు
మిక్స్‌డ్	రూ.25.06 లక్షలు
నాన్ రెసిడెన్సీ	రూ. 68.42 లక్షలు
రెసిడెన్సీ	రూ. 304.75 లక్షలు
రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు	రూ.98.56లక్షలు

వసూలుకు ప్రత్యేక బృందాలు

పన్ను వసూలు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 48 శాతం పన్ను వసూలైంది. మార్చిలోగా వంద శాతం పన్ను వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి నోటీసులు ఇస్తున్నాం.

– రమేశ్, కమిషనర్, బాన్సువాడ మున్సిపాలిటీ

మొగి పురుగును నియంత్రించాలి



బీబీపేటలో వరిని పరిశీలిస్తున్న ఏడీఏ అపర్ణ



మొక్కజొన్నను పరిశీలిస్తున్న గాంధారి ఏవో నరేశ్



సజ్జన్‌పల్లిలో వరిని పరిశీలిస్తున్న ఏఈవో ప్రశాంత్

బీబీపేట/మాచారెడ్డి/లింగంపేట: వరి పంటను ప్రస్తుతం కాండం తొలుచు, మొగి పురుగు ఆశిస్తున్నదని, వాటి ని యంత్రణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఏడీఏ అపర్ణ, లింగంపేట ఏఈవో ప్రశాంత్‌కుమార్ సూ చించారు. బీబీపేట మండల కేంద్రంతోపాటు మాచారెడ్డి మండలం ఎల్లంపేట, నడిమి తండా గ్రామాల్లో ఏడీఏ, లింగంపేట మండలం సజ్జన్‌పల్లిలో ఏఈవో గురువారం వారు పర్యటించి వరిని పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వరిలో మొగి పురుగు నివారణకు వరి నాటిన 20 రోజుల్లోగా కారటప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున ఇసుకతో కలిపి వేయాలన్నారు. 20 రోజుల దాటిన వరికి కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ మందును ఎకరానికి 400 గ్రాములు లేదా క్లోరాంతనిలిప్రోల్ 60 ఎంఎల్ లేదా టెట్రానిలిప్రోలు 100 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. పొలాల గట్ల మీద కలుపు, అధిక యూరియా వాడకం కారణంగా అగ్గి తెగులు కూడా కొన్ని చోట్ల పంటను ఆశించిందని, దాని నివారణకు ట్రియసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చే యాలని సూచించారు. ఏడీఏ వెంట ఏవో పవన్, ఏఈవో రాఘవేంద్ర, ఏఈవో వెంట రైతులు పోచయ్య, సాయిలు, బాల పోచయ్య తదితరులున్నారు.

గాంధారి మండలంలో..

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని గౌరారం, ముదెల్లి గ్రామాల్లో ఏవో నరేశ్ పర్యటించి వరి, మొక్కజొన్నను పరిశీలించారు. వరిని కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు, జొన్న, మొక్కజొన్నను కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు ఆశించిందని ఆయన తెలిపారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించామన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంగీత

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గురుకుల పాఠశాల విద్యార్థిని నేహ జాతీయస్థాయి అండర్–14 స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత గురువారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో నేహ పాల్గొంటుందన్నారు. అనంతరం విద్యార్థిని నేహను ప్రిన్సిపాల్ సంగీత, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పీఈటీ జ్యోత్స్న, హౌస్ టీచర్ చెన్నకేశ్వరి తదితరులు అభినందించారు.

గ్రీన్‌హౌస్ సేద్యంతో ఎన్నో లాభాలు



మాచారెడ్డి : గ్రీన్‌హౌస్ సేద్యంతో ఎన్నో లాభాలుంటాయని కామారెడ్డి ఏడీఏ అపర్ణ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఖేతి సంస్థ ఆధ్వర్యంలో గ్రీన్ హౌస్ సేద్యంపై 60మంది రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీన్‌హౌజ్ సేద్యం వల్ల చీడ పీడల భారీ నుంచి పంటలను రక్షించుకోవచ్చన్నారు. అలాగే మామూలు సేద్యం కంటే అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఖేతి సంస్థ రీజినల్ మేనేజర్ విఠల్ మాట్లాడుతూ రూ.1.16లక్షల ఖేతీ హౌస్‌ను 52శాతం సబ్సిడీపై రూ. 50 వేలకే అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాచారెడ్డి, భిక్కనూరు ఏవోలు రమ్యశ్రీ, రాధ, ఏఈవోలు శ్రీకాంత్, యూసఫ్, రాంలు, లక్ష్మణ్ ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

బాన్సువాడ రూరల్ : గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా గ్రామస్తులు సహకరించాలని బోర్లం గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారిగా నియమించబడిన ఎంఈవో నాగేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని 25 జీపీలకు మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులకు ప్రత్యేకాధికారులను నియమించారన్నారు. జీపీ కార్యదర్శి సాయికుమార్, సర్పంచ్ సరళ, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, దేవేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, గోపన్‌పల్లి సాయిలు, మన్నె విఠల్, దడ్గి ఆహ్మద్, మంజూర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధి ప్రజావేదిక

- మస్టర్లలో అవకతవకలు..
- మృతిచెందిన కూలీల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు గుర్తింపు



ప్రజావేదికలో సమీక్షిస్తున్న డీఆర్డీవో సాయన్న

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో 2022–23 సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో సామాజిక తనిఖీ పూర్తికాగా.. ఉపాధిహామీ కార్యాలయం వద్ద డీఆర్డీవో ఆధ్వర్యంలో గురువారం ప్రజావేదిక నిర్వహించారు. పలు గ్రామాల్లో మస్టర్లలో అవకతవకలు, మృతి చెందిన కూలీల ఖాతాల్లో డబ్బులు జమచేసినట్లు గుర్తించి ఎఫ్‌ఏలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్వినియోగమైన డబ్బులను రికవరీ చేయాలని ఆదేశించారు. సీతాయిపల్లి, దుర్గం, నేరల్, ముదెల్లి గ్రామాల్లో చనిపోయిన కూలీల పేరున ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు గుర్తించి డబ్బులు రికవరీకి ఆదేశించారు. గురువారం రాత్రి వరకు 31 గ్రామ పంచాయతీల సమీక్ష పూర్తయ్యింది. ప్రజావేదికలో ఎఫ్‌ఎం రాంనారాయణ, డీబీటీ కల్పన, డీవీవో దత్తాద్రి, ఎస్టీఎం నరేందర్, ఎస్ఆర్‌పీలు రవి, పాండురంగ, ఎంపీడీవో సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రకాంత్

కామారెడ్డి అర్బన్ : డిగ్రీ పూర్తయిన తర్వాత విద్యార్థులు చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని జిల్లా నోడల్ అధికారి, ఎంఎస్ఎంఈ ప్రతినిధి రాజేష్‌కుమార్ యాదవ్ అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ సౌజన్యంతో థర్డ్ ఇయర్ విద్యార్థులకు ఒకరోజు ఎంట్రప్రెన్యూర్‌షిప్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంఎస్‌ఎంఈలకు అనేక ప్రోత్సాహక పథకాలు అమల్లో ఉన్నాయని రాజేష్‌కుమార్ వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అడకమిక్ సమన్వయకర్త వి శంకర్ మాట్లాడుతూ ఔత్సాహిక విద్యార్థులకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పితే అద్భుతాలు జరుగుతాయన్నారు. సమావేశంలో టీఎస్‌కేసీ సమన్వయకర్త ఫర్హీన్ ఫాతియా, మెంటర్ అజారొద్దీన్, అధ్యాపకులు సుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు



బస్వాపూర్ వద్ద మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

భిక్కనూరు : కామారెడ్డి నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, మురికికాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 13 కోట్లను మంజూరు చేసిందని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండలం బస్వాపూర్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారందరికి గుర్తింపు ఉంటుందన్నారు. అర్హులకు సంక్షేమ ఫలాలు ఉంటాయన్నారు. ఆరుగ్యారంటీ పథకాలతో పాటు వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు డు కైలాస్ శ్రీనివాస్‌రావు, ఎంపీపీ గాలిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, నేతలు సాజిద్, దయాకర్‌రెడ్డి, చింటు, కిరణ్, సురేశ్, శ్రీనివాస్, లింబాద్రి, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న షబ్బీర్ అలీ, టీపీటీఎఫ్ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్ : ఈనెల 11, 12వ తేదీల్లో ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్ పోస్టర్లను ప్రభుత్వ ముఖ్య సలహాదారు షబ్బీర్ అలీ చేతుల మీదుగా గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. అనిల్ కుమార్, మాజీ రాష్ట్ర అధ్యక్షులు కే రమణ, ఉపాధ్యక్షురాలు నలినీ దేవి, నాయకులు విజయశ్రీ, స్వప్న, ప్రియ తదితరులున్నారు.

సిబ్బంది కష్టపడి పని చేయాలి

బాన్సువాడ రూరల్ : వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడానికి ట్రాన్స్‌కో సిబ్బంది కష్టపడి పనిచేయాలని కామారెడ్డి ఎస్ఈ రమేశ్ బాబు అన్నారు. గురువారం మండలంలోని సోమేశ్వర్ శివారులోని రైతువేదికలో బాన్సువాడ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ భారం తగ్గించాలన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. డీఈ కామేశ్వరరావు, ఎస్ఏవో శ్రీనివాస్, వెంకటరంగయ్య, డివిజన్‌లోని ఆయా మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షలకు టోకరా..

కామారెడ్డి క్రైం: సైబర్ మోసాలపై పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా.. ఏదో ఓచోట మోసం జరుగుతూనే ఉంది. మోసగాళ్లు కొత్తదారులను వెతుకుతూ డబ్బులు కాజేస్తున్నారు. ఈ కోవలోనే మరో ఘటన పట్టణంలో గురువారం వెలుగు చూసింది. భానుప్రకాశ్ అనే వ్యక్తికి రెండురోజుల క్రితం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ ఐసీఐసీఐ క్రెడిట్ కార్డుకు అంతర్జాతీయ లావాదేవి ఆప్షన్ ఆన్‌లో ఉందని, ఆఫ్ చేయాలంటే తాను చెప్పిన విధంగా చేయాలన్నాడు. అతను చెప్పినట్లు ప్లేస్టోర్‌లో 'ఐ' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని క్రెడిట్ కార్డు వివరాలు ఇవ్వగానే అతని అకౌంట్‌లో నుంచి రూ.1.50 లక్షలు కట్ అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన భానుప్రకాశ్ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వృద్ధురాలి మృతి



నవీపేట: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కిందపడి స్టేషన్ ఏరియాకు చెందిన రత్నావత్ శృతి అలియాస్ గుండిబాయి(60) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ గురువారం తెలిపారు. కాచిగూడ నుంచి నాగర్‌సోల్‌కు వెళ్తున్న రైలులో తినుబండారాల ప్యాకెట్లు విక్రయించే వృద్ధురాలు ఒక బోగీ నుంచి మరో బోగీలో ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి రైలు కిందపడి మృతి చెందిందన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



బీబీపేట: బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని యాడారంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సంఘమేశ్వర్(46) మూడు రోజుల క్రితం బీబీపేటకు వచ్చి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గురువారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కంజర్ గ్రామానికి చెందిన పిల్లి భూమారావు మోపాల్ నుంచి వస్తుండగా, కులాస్‌పూర్‌కు చెందిన పసుల శేఖర్ తన భార్య, చిన్నమ్మతో మోపాల్ వైపు వస్తుండగా కంజర్ శివారులో బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శేఖర్, ఆయన భార్య, చిన్నమ్మకు గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై గంగాధర్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రుద్రూర్: కోటగిరి మండలంలో ఇసుకను అక్ర మంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక అశోక్ లేలాండ్ వాహ నాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీలో పట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం వాహనాలను సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు.

బస్సులో బంగారం చోరీ



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎడపల్లి/బోధన్ టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గుండ్లు చోరీకి గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన పోసాని రుద్రూర్‌లో బంధువుల శుభాకార్యం నిమిత్తం గురువారం వెళ్లింది. తిరుగు ప్రయాణంలో బోధన్ బస్టాండ్‌లో నిజామాబాద్‌కు వచ్చే బస్సు ఎక్కింది. బస్సు ఎక్కినప్పుడు మెడలో ఉన్న రెండు తులాల బంగారు గుండ్లు ఎడపల్లి ప్రాంతంలో చూసే సరికి కనిపించలేదు. దీంతో బాధితురాలు డ్రైవర్, కండక్టర్‌కు చెప్పడంతో వారు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ప్రయాణికులను తనిఖీ చేయగా బంగారం లభించలేదు. దీంతో బాధితురాలిని బోధన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.


మహిళల సొమ్ము హాంఫట్..

- రూ. 6 లక్షల సొమ్ము కాజేసిన కెనరా బ్యాంక్ కరస్పాండెంట్

వర్ని: డ్వాక్రా సంఘం మహిళలు ప్రతి నెలా జమ చేస్తున్న రూ. 6లక్షల60వేల నగదును ఓ ప్రబుద్ధుడు తనదైన శైలిలో హాంఫట్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సైడిమల్ గ్రామానికి చెందిన జైభవాని గ్రూపు సభ్యులు 25 నెలలుగా గ్రామంలో ఏర్పాటు చేసిన కెనరా సర్వీస్ బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తున్నారు. ఈ సర్వీసు బ్యాంక్‌ను అదే గ్రామానికి చెందిన కృష్ణ నిర్వహిస్తుండగా అతనికి గత 25 నెలలుగా సంఘ సభ్యులు నగదును అందజేస్తున్నారు. వారికి నామమాత్రపు రసీదులు ఇచ్చి నగదు బ్యాంకులో జమ అయిందని చెప్పేవాడు.

ఈ విషయమై బ్యాంకులో సభ్యులు విచారణ చేయగా ఖాతాలో జీరో బ్యాలెన్స్ ఉండడంతో కృష్ణను ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రూప్ రెండో లీడర్ వడ్ల బాలమణి, సభ్యులు తెలిపారు.

కొరట్‌పల్లి తండాలో ఇద్దరి అరెస్ట్



ఆర్మూర్‌టౌన్: డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి తండాలో సారా కాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆర్మూర్ ఎక్సై జ్ సీఐ స్టీవెన్‌సన్ గురువారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా సారా, బెల్లం పానకం లభ్యమైనట్లు చెప్పారు. నిషేధిత సారా కాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయన వెంట ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బేకరీలో కుళ్లిన కేక్‌లు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని డాల్ఫిన్ బెంగళూరు బేకరీలో కుళ్లిన కేక్‌లు విక్రయిస్తుండడంతో పలువురు ఆందోళనకు దిగారు. గురువారం పుట్టినరోజు వేడుకల కోసం ఓ కస్టమర్ బేకరీ నుంచి కేక్ తీసుకెళ్లాడు. అది తిన్న బాధితులకు వాంతులయ్యాయి. ఈ విషయమై బేకరీ నిర్వాహకుడిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు బాధితులు తెలిపారు. ఆర్మూర్ ఇన్‌చార్జి కమిషనర్ భూమేశ్వర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌కు ఫిర్యాదు చేయడంతో వారు కుళ్లిన కేకులను పరిశీలించారు. తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇంటి యజమానులు అనుమతి తీసుకోవాలి

ఖలీల్ వాడి: గల్ఫ్, పాస్‌పోర్ట్, ట్రావెల్స్ ఏజెంట్లకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ఇంటి యజమానులు అనుమతి తీసుకోవాలని నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో సూచించారు. ఏజెంట్లకు సంబంధించిన వివరాలను ఇంటి యజమానులు తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

రాజంపేట: డ్రంకన్ డ్రైవ్‌లో మండల కేంద్రానికి చెందిన మ్యాదరి లక్ష్మణ్‌కు రెండో తరగతి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై సంపత్ గురువారం తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు.

అనుమానితుల పట్టివేత

తాడ్వాయి: మండలంలోని కన్కల్ గ్రామంలో భిక్షాటన పేరిట తిరుగుతున్న నలుగురు అనుమానిత మహిళలను గ్రామస్తులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు గురువారం తరలించారు. ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన వీరు గ్రామంలో బియ్యం, నగదు పేరిట భిక్షాటన చేస్తున్నారు. వీరి ప్రవర్తపై అనుమానం వచ్చిన గ్రామస్తులు వారిని నిలదీశారు. మీరు భిక్షాటన కోసం రాలేదని చిన్నపిల్లలను దొంగిలించేందుకు వచ్చారంటు వారిని పట్టుకొని పీఎస్‌కు తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: పట్టణంలోని పెద్ద బజార్‌లో ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఫర్హానా బేగం బుధవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పిల్లలతో కలిసి పక్క కాలనీలో ఉండే తల్లిగారి ఇంటికి వెళ్లింది. గురువారం సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. 2 తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.